క్లుప్తంగా

సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

జగిత్యాల: సీపీఆర్ పట్ల ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని, ఎవరైనా హార్ట్ ఎటాక్‌కు గురైతే అత్యవసర సమయంలో బతికించవచ్చని మెడికవర్ ఆస్పత్రి నిర్వాహకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్టార్ హెల్త్ కార్యాలయంలో సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. సీపీఆర్‌పై అవగాహన ఉంటే ప్రాణాపాయం నుంచి వ్యక్తిని కాపాడవచ్చని, ఎలా చేయాలన్నది ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి నిర్వాహకులు గుర్రం కిరణ్, డాక్టర్లు నాగరాజు, సూపరింటెండెంట్ లావణ్య, కరుణాకర్, చంద్రశేఖర్, సాయితేజ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలను సందర్శించిన నోడల్ అధికారి


మాట్లాడుతున్న నోడల్ అధికారి నారాయణ

మేడిపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి నారాయణ మంగళవారం సందర్శించారు. విద్యార్థులు ప్రతి రోజు కళాశాలకు హాజరై మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఎరువుల గోదాం పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్


మేడిపల్లి: మండలంలోని కొండాపూర్, వల్లంపల్లి గోదాంలను జిల్లా వ్యవసాయాధికారి బి. బాస్కర్ మంగళవారం తనిఖీ చేశారు. గోదాంలో స్టాక్ సామర్థ్యం, పంపిణీ విదానంను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి షాహిద్ అలీ, ప్యాక్స్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన కాలనీవాసులు


గుంతలు పూడ్చుతున్న యువకులు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రం శివారులోని ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ధర్మసాగర్ కాలనీలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వెళ్లే దారి పెద్ద పెద్ద గుంతలతో నడువరాని పరిస్థితి నెలకొంది. గుంతలను పూడ్చి రోడ్డు బాగు చేయాలని అధికారులకు పలు సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తూ మంగళవారం కొంత మంది ముందుకు వచ్చి దారిలోని పెద్ద పెద్ద గుంతలను శ్రమదానంతో పూడ్చి వేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీకి వెళ్లే దారిని సీసీ రోడ్డు చేసి విధీ దీపాలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఘనంగా రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు


నినాదాలు చేస్తున్న కార్మికులు

మెట్‌పల్లి: పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అమర వీరులకు నివాళి అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ భూస్వాముల ఆకృత్యాలకు వ్యతిరేకంగా నాడు రైతులతో కలిసి సీపీఐ పోరాటం చేసిందన్నారు. ఆ పోరాటాల ఫలితంగానే తెలంగాణను భారత్‌లో విలీనం చేశారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఉస్మాన్, బర్ల లక్ష్మణ్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్: పట్టణంలోని చిన్నజీయర్‌స్వామి ట్రస్ట్ ప్రతిమ ఫౌండేషన్, జీఎంఆర్ ఫౌండషన్ సంయుక్తంగా మహిళలకు టైలరింగ్, హోం అండ్ హెల్త్, పురుషులకు ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 99633 47142 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి


సిరికొండలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

కథలాపూర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇళ్లను వేగవంతంగా నిర్మించుకోవాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. కథలాపూర్ మండలం సిరికొండలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలకు ఏమైనా ఇబ్బందులుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు సూచించారు. ఇళ్లు సకాలంలో నిర్మించుకుంటే బిల్లులు త్వరగా మంజూరవుతాయన్నారు. ఆయన వెంట ఎంపీవో రాజశేఖర్, కార్యదర్శి నర్సారెడ్డి ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించాలి

ఇబ్రహీంపట్నం: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని ఎంపీవో రామకృష్ణరాజు తెలిపారు.మండలంలోని వర్షకొండలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారి ఫొటో క్యాప్చరింగ్ విషయంలో ఆలస్యం చేయవద్దని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు


మాట్లాడుతున్న చైర్మన్ రాములుగౌడ్

పెగడపల్లి: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఎలాంటి ఇబ్బదులు లేకుండా చర్యలు తీసుకుంటామని పెగడపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం మంగళవారం జరిగింది. మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేయాల్సిన వసతులు, అభివృద్ధి పనులు, కావాల్సిన నిధులపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఏఎంసీ ద్వారా వ్యాపారులు రైతుల ధాన్యం క్రయ విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ సురకంటి సత్తిరెడ్డి, ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఏ రామచంద్రం, మార్కెటింగ్ కార్యదర్శి వరలక్ష్మి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఉట్ల పండుగ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఉట్ల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వర్షం కారణంగా ప్రధాన ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి మేళ తాళాలతో తీసుకెళ్లి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో సోమవారం రాత్రి శ్రీ కృష్ణాష్టమి వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కూరగాయాల మార్కెట్ వద్ద ఉట్టి ఏర్పాటుచేయగా, ఉట్టి కొట్టేందుకు యువకులు పోటీ పడి వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఉట్టి కొట్టారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలు వినియోగించుకోవాలి


ఆయిల్‌పాం తోటను పరిశీలిస్తున్న అధికారులు

సారంగాపూర్: ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని ప్రోత్సహించడానికి అందించే రాయితీలను రైతులు వినియోగించుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి కందుకూరి స్వాతి అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండల కేంద్రంతో పాటు, తుంగూర్ గ్రామంలో ఆయిల్‌పాం సాగు, బంతిపూల సాగుతోటలను ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆయిల్ పాం తోటలు నాలుగేళ్ల అంతర్ పంటగా పాక్షిక నీడ అవసరమయ్యే కోకో, వక్క, అరటి, బంతి తోటలను వేసుకోవచ్చని దీని ద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ విస్తీర్ణాధికారి వంశీకృష్ణ, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల పరిశీలన

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లోని ఆయిల్ పామ్ తోటలను ఉద్యానవనశాఖ కోరుట్ల క్లస్టర్ అధికారి అన్వేష్, లోహియా కంపెనీ మేనేజర్ విజయ్ భరత్ మంగళవారం పరిశీలించారు. రెండున్నర ఏళ్ల వయస్సు గల చెట్లకు పూత వస్తే తీసివేయవద్దని, త్వరలోనే పరాగ సంపర్కం కోసం పురుగులను విడుదల చేస్తామని రైతులకు సూచించారు. చెట్ల అడుగు భాగంలో గడ్డి నివారణ మందును పిచికారీ చేయవద్దన్నారు. వారి వెంట రైతు నాయకులు గడ్డం శేఖర్‌రెడ్డి, పూండ్ర జనార్ధన్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, జవిడి ప్రిన్స్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణ్ ఉన్నారు.

17 నుంచి స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్

వెల్గటూర్: ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఉమ్మడి వెల్గటూర్ మండలంలో స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డా.లవకుమార్ తెలిపారు. సెప్టెంబర్ 17, 22, 26 తేదీల్లో ఎండపల్లి మండలం అంబర్‌పేట పీహెచ్‌సీ పరిధిలో, సెప్టెంబర్ 18, 26, అక్టోబర్ 1వ తేదీల్లో వెల్గటూర్ మండలం లోని పీహెచ్‌సీ పరిధిలో స్పెషలిస్ట్ క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

18న కథలాపూర్‌లో రక్తదాన శిబిరం

కథలాపూర్: ఈనెల 18న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా కథలాపూర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు కాశవత్రి వంశీ, ఎం.డీ రేహాన్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, యువకులు అధికసంఖ్యలో హాజరై రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, ఆకుల సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

19న రాయికల్‌లో మెగా క్యాన్సర్ శిబిరం

రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈనెల 19న ఉచిత మెగా క్యాన్సర్ శిబిరం నిర్వహించనున్నట్లు ప్రాజెక్ట్ చైర్మన్ మోర సుమన్‌కుమార్, అధ్యక్షుడు ఏవీఎల్ఎస్.చారి, సెక్రటరీ రాజులు మంగళవారం తెలిపారు. కరీంనగర్‌లోని ఒమెగా సుశృత హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా క్యాన్సర్ శిబిరం నిర్వహిస్తున్నామని, ఎక్స్‌రే, మమోగ్రామ్ ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చర్మవ్యాధుల నిర్ధారణ శిబిరాన్ని విజయవంతం చేయాలి

జగిత్యాల: చర్మవ్యాధుల నిర్ధారణ శిబిరాన్ని విజయవంతం చేయాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మోతె పట్టణ ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే వైద్య శిబిరంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ చర్మవ్యాధుల నిపుణులు పాల్గొంటారని తెలిపారు.

రోడ్డు విస్తరణకు నిధుల ప్రతిపాదనపై హర్షం

మల్యాల: చొప్పదండి నియోజకవర్గంలోని ఆర్నకొండ నుంచి మల్యాల మండలం వరకు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, ఎంపీ బండి సంజయ్ నిధుల మంజూరూ కోసం ప్రతిపాదనలు పంపడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర రోడ్డు మౌలిక వసతుల కల్పన నిధుల నుంచి రూ. 50కోట్ల మంజూరు కోసం ప్రతిపాదనలు చేయడంపై మంగళవారం మల్యాలలో బీజేపీ నాయకులు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం, చదువుపై శ్రద్ధ వహించాలి

ధర్మపురి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆరోగ్యంతో పాటు మంచి విద్యనందించడానికి జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీ, ఏసీడీపీవో మౌనిక అన్నారు. ధర్మపురి పట్టణంలో మంగళవారం ప్రాజెక్టు పరిధిలోని 199 మంది అంగన్‌వాడీ టీచర్లకు పోషణ బీ – పడాయి బీ కార్యక్రమంపై ఒక్క రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. శిక్షణ తరగతుల్లో పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్య ఆట పాటల ద్వారా అభ్యసనము అదే విధంగా తల్లిదండ్రులైన గర్భిణులకు పిల్ల తల్లులు తీసుకునే పోషక ఆహారం జాగ్రత్తలు తదితర వాటిపై శిక్షణలిచ్చారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్‌స్పోర్ట్స్: కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ, యువభారత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ఆన్‌లైన్ క్విజ్ కార్యకమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని మై భారత్, మేరా యువ భారత్ ఉమ్మడి జిల్లా యూత్ ఆఫీసర్ ఎం.వెంకట్‌రాంబాబు అన్నారు. 10వేల మంది యువతను క్విజ్ ప్రోగ్రాం ద్వారా ఎంపిక చేసి వివిధ స్థాయిల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు. అత్యంత ప్రతిభకనబర్చిన వారిని జిల్లా, రాష్ట్ర, దేశీయ స్థాయిలో ప్రభుత్వ ఖర్చులతో ఢిల్లీకి తీసుకెళ్తామని అన్నారు. చివరి అంకంలో దేశాభివృద్ధి, అభివృద్ధి చెందిన భారత్ కోసం దేశం అనుసరించాల్సిన వ్యూహంపై ప్రధానితో చర్చించే అవకాశం ఉంటుందని తెలిపారు. క్విజ్ పోటీల్లో పాల్గొనే వారు ఇంగ్లిష్‌తో పాటు 12 భారతీయ భాషల్లో ఏదైన ఒక భాష ఎంచుకోవచ్చని అన్నారు. సెప్టెంబర్ 1,నాటికి 15–29 ఏళ్ల వయస్సు కలిగి ఆసక్తి గల యువతీ యువకులు ఆన్‌లైన్‌లో మై భారత్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

మల్లాపూర్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తున్నట్లు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస్‌రావు తెలిపారు. మండలంలోని వేంపల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న జర్నలిస్ట్ మిడిదొడ్డి మల్లేశ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజె(ఐజేయూ) రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాగుల గోపాల్‌చారి, జిల్లా సహాయ కార్యదర్శి కోరెపు రాజ్‌కుమార్, జిల్లా కార్యవర్గసభ్యుడు నాగిరెడ్డి రఘుపతి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో ఎఫ్‌ఎం రేడియో ప్రారంభం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో మంగళవారం ఎఫ్‌ఎం రేడియో కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన విరామ సమయంలో విద్యార్థులకు వినోద భరితంగా జ్ఞానపూర్వకంగా దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, నర్సయ్య, శ్రీధర్, నరేశ్ పాల్గొన్నారు.

గొల్లపల్లిలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

గొల్లపల్లి: మండల కేంద్రంలో గాయత్రి మాత పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న విశ్వకర్మ భగవానుడి పంచాహ్నిక యజ్ఞ మహోత్సవాలలో మంగళవారం మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాలభక్తుల కిషన్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పోలుకల రాజగణేశ్, దేవరకొండ కరుణాకర్, బీఆర్ఎస్ నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్‌లో విద్యార్థినుల ప్రతిభ

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస ఎక్స్‌లెన్స్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చారు. వరంగల్‌లోని ఇండోర్ స్టేడియంలో జరిగిన స్టేట్‌లెవల్ కిక్‌బాక్సింగ్‌లో పోటీల్లో సాన్విక సిల్వర్, సిరివర్షిని, హారతి, శ్రీనిధి బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ రజితరావు, శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు అభినందించారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ

పట్టణంలోని తెలంగాణ మైనార్టీ కళాశాల విద్యార్థి హయానోద్దీన్ ఇటీవల కరీంనగర్‌లో జరిగిన సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణ పతకాలు సాధించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్, పీఈటీ అంజయ్య, కో–ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, తిరుపతి, నవీన్, మహేశ్, జ్యోతి, నిజాముద్దీన్, కల్యాణి, సరిత, అభినందించారు.

గ్రామపాలన అధికారులకు బాధ్యతలు అప్పగింత

ఇబ్రహీంపట్నం: మండలంలోని 17 గ్రామాలకు 12 గ్రామ పాలన అధికారులను కేటాయించగా, మంగళవారం తహసీల్దార్ వరప్రసాద్ 10 మంది గ్రామ పాలన అధికారులకు గ్రామాలను అప్పగిస్తూ ఉత్తర్వులు అందజేశారు. గుండా శ్రీనాథ్ (వేములకుర్తి, యామాపూర్) నక్క నాగర్జున (అమ్మక్కపేట, డబ్బా) కరం రాజేశం, (వర్షకొండ, కోమటికొండాపూర్) సుంకెం తిరుపతి (ఇబ్రహీంపట్నం 1, ఇబ్రహీంపట్నం 2) సురుమల్ల లక్ష్మణ్ (తిమ్మాపూర్, గోధూర్) తోగరి శేఖర్ (ఎర్దండి, మూలరాంపూర్) గ్రామాలను అప్పగించారు. రేవెల్ల జల, ఊరేడి అపర్ణ, దాసమల్ల వరలక్ష్మి, బండెల్ల నాగమణిలకు తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలను అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు.

స్టాక్ మార్కెట్లలో ఆలోచించి పెట్టుబడి పెట్టాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

జగిత్యాల: ప్రస్తుత యువత ఎక్కువగా స్టాక్ మార్కెట్ వైపు ఆకర్షితులు అవుతున్నారని, సరైన అవగాహన లేక పెట్టుబడులు పెట్టడంతో తీవ్రంగా నష్టపోతున్నారని, ఆలోచించి పెట్టుబడులు పెట్టాలని భారతీయ సెక్యూరిటీస్ ఎక్స్చేంజ్ బోర్డు నిపుణుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పెట్టుబడులు పెట్టేందుకు ఫండమెంటల్ అనాలసిస్ రిస్క్ మేనేజ్‌మెంట్ పద్దతులు తెలుసుకోవడం, మోసపూరిత పథకాల పట్ల అప్రమత్తంగా ఉండటం తప్పనిసరన్నారు. నిపుణుల సలహాలు తీసుకుని స్టాక్ ఎక్చేంజ్‌లో పెట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్, కామర్స్ విభాగం అధిపతి గోవర్దన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రజాకార్ల పార్టీలే'


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు రజాకార్ల పార్టీలనేనని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం అన్నారు. పెగడపల్లిలో మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువును పీల్చుకున్న సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవంగానే అధికారికంగా జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పల్లె మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తోడెటి గట్టయ్య, ఉపాధ్యక్షుడు వరద రామ్, జక్కుల హరీశ్ పాల్గొన్నారు.

తెలంగాణ విమోచనాన్ని అధికారికంగా నిర్వహించాలి

ధర్మపురి: 17న జరగనున్న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ పట్టణ, మండల శాఖ అధ్యక్షులు గాజు భాస్కర్, కుమ్మరి తిరుపతి డిమాండ్ చేశారు. ధర్మపురి పట్టణంలో మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద కర పత్రాలను పంపిణీ చేశారు. 1948లో నైజాం పాలకుల నుంచి విముక్తి పొందిన తెలంగాణ దేశంలో విలీనమైందని, దీనికి సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవన్‌కుమార్ నాయకులు పాల్గొన్నారు.

జ్వర లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలి

మల్లాపూర్: సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని అన్నారు. మంగళవారం సంగెం–శ్రీరాంపూర్‌లో నిర్వహించిన హెల్త్ క్యాంప్‌లో గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యసూత్రాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు సుశీల, మమత, ఆశ కార్యకర్త ఎల్కా భూదేవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

రాయికల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పోషణ్ బీ పడాయి లో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీవో మమత, సుల్తానాబేగం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా ఈనెల 16 నుంచి 18 వరకు నిర్వహించే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మావతి, సువర్ణ, రాధ, లావణ్యతో పాటు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని పూడూరు రైతు ఐక్యవేదిక భవనంలో మల్యాల ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు పోషన్ బి పడాయి శిక్షణ కార్యక్రమాన్ని సీడీపీవో వీరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో వీరలక్ష్మి మాట్లాడుతూ పిల్లల పోషణ మరియు చదవడంపై ఐదు రకాల పద్ధతులను గురించి వివరించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో అరవింద, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మించాలని కమిషనర్‌కు వినతి

రాయికల్: పట్టణంలోని 3వ వార్డులో సీసీరోడ్డు నిర్మించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. సీసీరోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, కాశేశ్వరం రవి, రాజయ్య, రవీందర్, రాజశేఖర్, అనిల్, నారాయణ, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపిక

మల్యాల: ఎస్జీఎఫ్ పోటీల్లో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన 18 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో జయసింహారావు తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో విద్యార్థులు క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సుదర్శన్, శివకుమార్; సాత్విక్, రహీం, అజయ్, నవనీత్, అభినయ్, దీక్షిత్, రాజేందర్, దుర్గా ప్రసాద్, హర్షవర్ధన్, సంగీత్, రెహాన్, ఆశిష్, అభిరాం, హుస్సేన్, సాయి చరణ్, వెంకటాచారి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం అనుపమ, పీడీ విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడలు

కొడిమ్యాల: ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలు మంగళవారం ముగిశాయి. కార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో స్వరూపారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి భవిష్యత్తులో ఎదగాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయేంద్ర ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు


మోడల్ స్కూల్‌లో ఫ్రెషర్స్ డే

పెగడపల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ స్కూల్లో ఫ్రెషర్స్ డే వేడుకలు సందడిగా సాగాయి. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు జూనియర్లకు స్వాగతం పలుకుతూ చేసిన నృత్యరూపకాలు అలరించాయి. ప్రైవేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలన్నదే తమ లక్ష్యమని విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు ఆకాంక్షించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మల్యాల: మల్యాల మండలం బ్లాక్ ఆఫీస్ సమీపంలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారం, నగలు ఎత్తుకెళ్లారు. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మల్యాల మండలం కేంద్రానికి చెందిన కట్టెకోల మల్లేశ్వరి అనారోగ్యంతో బాధపడుతూ రామన్నపేటలోని తన అక్క ఇంటికి ఈ నెల 14న వెళ్లి, మంగళవారం ఇంటికి తిరిగి వచ్చింది. ఇంటి వెనకాల తలుపుల గొళ్లెం పగుల గొట్టి ఉండడంతో, ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా, గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువాలోని బంగారు కమ్మలు, వెండి ఆభరణాలు, పదివేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై నరేశ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వెల్గటూర్: రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు ఎండపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉమ్మడి వెల్గటూర్ మండలానికి చెందిన 65 మంది లబ్ధిదారులకు సీంఎంఆర్ఎఫ్ చెక్కులు ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శేఖర్, అనిల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, కోటిలింగాల ఆలయ కమిటీ చైర్మెన్ రమేష్, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో జాతీయ స్థాయి ఇన్నోవేషన్

కొడిమ్యాల: మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూ కళాశాలలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ జాతీయ స్థాయి ఇన్నోవేషన్ ను కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథ రాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రధానంగా విద్యార్థుల సజనాత్మక ఆలోచనలు,కొత్త ,కొత్త సాంకేతిక సమస్యల పరిష్కారాలు లభిస్తాయని, ఉద్యోగ, స్టార్టప్ అవకాశాలు ఉంటాయని, జాతీయస్థాయి గుర్తింపు దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఓసీ శ్రీ రాధా చరణ్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

కాపర్‌వైరు మాయంపై అనుమానాలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంకు సంబంధించిన బోర్‌వెల్ మోటార్ కాపర్ వైరు మాయమైనట్లు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. చింతామణి చెరువు కట్ట వద్ద దేవస్థానం నిధులతో బోరు బావిని తవ్వి విద్యుత్ మోటార్ అమర్చారు. అంతకముందు చెడి పోయిన బోరు బావిలో మోటారు మరమ్మతుల కోసం గోతిని తవ్వి ఆలయ అధికారులు, సిబ్బంది సమక్షంలో బావిలో ఉన్న కాపర్ వైరుతో పాటు మోటారును బయటకు తీసి అక్కడే వదిలిపెట్టి వెళ్లినట్లు తెలిసింది. ఇటీవల కాపర్ వైరు, మోటారు అక్కడ లేకపోవడంతో మాయమైనట్లు చర్చ జరుగుతోంది. దీని విలువ సుమారు లక్ష వరకు ఉంటుందని పట్టణ ప్రజలు అంటున్నారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. కాపర్ వైరు మాయంపై దేవస్థానం ఈవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా దాని గురించి తెలియదని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి పూర్తి విషయాలు తెలుపుతానన్నారు.